E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారిగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD    సంపుటి :01    సంచిక :277    మంగళవారం 15 సెప్టెంబర్ 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 04    వెల :05/-




## తెలంగాణలో కొత్త చట్టం

తెలంగాణలో కొత్తగా క్యూర్ చట్టం

1.30 కోట్ల జనాభాకు కొత్త చట్టం

సీఎం చైర్మన్‌గా అపెక్స్ కౌన్సిల్

పట్టణ అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం

నిర్ణయాలు అమలు చేయనున్న కమిటీ

సీఎస్ చైర్మన్‌గా ఎగ్జిక్యూటివ్ కమిటీ

మూడు నెలలకోసారి కీలక భేటీ



**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్)పై ఫోకస్ పెట్టింది. జీ హెచ్ఎంసీ 1955 చట్టాన్ని 70 ఏండ్ల తర్వాత సవరణలు చేయడంతోపాటు కొత్తగా క్యూర్ చట్టాన్ని రూ పొందించారు. 1955లో 12 లక్షల మంది జనాభాకనుగుణంగా చట్టాన్ని రూపొందించారు. కానీ ప్రస్తుతం 1.30 కోట్ల జనాభాకనుగుణంగా క్యూర్ చట్టాన్ని రూ పొందించినట్టు ప్రభుత్వం చెబుతోంది. క్యూర్ పరిధిలో పట్టణ పరిపాలన, ప్రణాళికలు, కార్యక్రమాలు రూపొందించడంతోపాటు చర్చించడానికి సీఎం చైర్మన్‌గా క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే దీన్ని కొత్త చట్టంలో పొందుపర్చారు. దీంతోపాటు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా అధికారులతో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. అయితే అపెక్స్ గవర్నెన్స్ కౌన్సెల్ చేసిన నిర్ణయాలు, ఆదేశాలను ఎగ్జిక్యూటివ్ కమిటీ అమలు చేయాల్సి ఉంటుంది.

2 లో

## మాక్ అసెంబ్లీ కాదు.. చేతల్లో చూపండి!

దళిత సీఎం హామీని కేసీఆర్ విస్మరించారు

దళితుల కోసం ఏం చేశారో చెప్పాలి

మూడెకరాల భూమి హామీ ఏమైంది?

దళితబంధుపై కేసీఆర్‌ది మాటలేనా?

అంబేద్కర్ విగ్రహం కాదు.. ఆచరణ ముఖ్యం

మాక్ అసెంబ్లీ కాదు.. చేతల్లో చూపండి

దమ్ముంటే తలసానిని ప్రతిపక్ష నేత చేయండి

2 లో

## మసూద్‌పై పాక్ కపట నాటకం!

మసూద్ ఆచూకీపై పాక్ నాటకం

రివార్డు పెంచిన పాకిస్తాన్ ప్రభుత్వం

రూ.24 లక్షల రివార్డు ప్రకటన

రెడ్‌బుక్‌లో కొనసాగుతున్న అజార్ పేరు

అఫ్గాన్‌కు పారిపోయాడంటున్న ఇస్లామాబాద్

భారత్‌లో పలు దాడుల వెనుక అజార్

ఫాట్ఫ్ సమావేశాల వేళ కీలక పరిణామం



2 లో

**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ అధినేత, అంతర్జాతీయ ఉగ్రవాది మసూద్ అజార్ ఆచూకీపై పాక్ కపట నాటకమాడుతోంది. మసూద్ పాక్ వద్దే ఉన్నాడని భారత్ ఆరోపిస్తుండగా తమకేమీ తెలియదంటూ.. తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే మసూద్ అజార్ ముతా సమాచారం అందించిన వారికి ఇచ్చే పారిదోషికాన్ని పాకిస్తాన్ ప్రభుత్వం పెంచింది. అజార్ ఆచూకీ తెలిపిన వారికి 70 లక్షల పాకిస్తానీ రూపాయలు (భారత కరెన్సీలో సుమారు రూ. 24.09 లక్షలు) రివార్డుగా చెల్లిస్తామని ప్రకటించింది. పాకిస్తాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ విడుదల చేసిన 2026 "రెడ్ బుక్ ఆఫ్ మోస్ట్ వాంటెడ్ హై ప్రొఫైల్ టెర్రరిస్ట్స్" జాబితాలో మసూద్ అజార్ పేరును కొనసాగిస్తోంది. మసూద్ అజార్ తమ దేశంలో లేదని, అతను అఫ్గానిస్తాన్‌కు పారిపోయాడని ఇస్లామాబాద్ గత కొన్ని ఏళ్లుగా వాదిస్తున్నప్పటికీ, అధికారిక రికార్డుల్లో మాత్రం అతని పేరును మోస్ట్ వాంటెడ్ జాబితాలోనే ఉంచడం గమనార్హం.

## మైనర్ బాలికపై నరరూప రాక్షసుల దాడి!

మూడు రోజులు.. మూడు ప్రాంతాలకు తరలింపు

మత్తుమందు ఇచ్చి బాలికను అపహరించిన నిందితుడు

ఓయో హోటల్‌లో మొదటి రోజు దారుణం

నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో మరోసారి

ఆగి ఉన్న రైలులోనూ లైంగిక దాడి

పోక్సో చట్టం కింద కేసులు.. పలువురు అరెస్ట్

మైనర్‌ను అనుమతించిన హోటల్ యాజమాన్యంపైనా కేసు

తొమ్మిది మంది కలిసి బాలికపై అఘాయిత్యం

మరో నలుగురి కోసం పోలీసుల గాలింపు

2 లో

## కవిత దూకుడు.. 18 ఇంచార్జిల ప్రకటన!

కవిత పార్టీ బలోపేతంపై ఫోకస్

మరో 18 నియోజకవర్గాలకు ఇంచార్జిలు

మొత్తం 60 స్థానాలకు నియామకాలు

వినాయక చతుర్థి రోజున ప్రకటన

పలు జిల్లాలకు కొత్త అధ్యక్షులు

మెదక్ లోక్‌సభ అధ్యక్షుడి నియామకం

2 లో



# గాంధీభవన్‌లో గుసగుసలు!

**న్యూస్ డెస్క్,14 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ కాంగ్రెస్‌లో ఇన్‌చార్జ్ మార్పుపై ప్రచారం జరుగుతున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సోమవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే అనూహ్యంగా ప్రత్యక్షమయ్యారు. దీంతో ఆయన గాంధీ భవన్‌కు రావడం వెనుక ఏదైనా రాజకీయ కారణం ఉందా? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రస్తుత ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను బాధ్యతల నుంచి తప్పించనున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే ఆమె ఉన్నత చదువుల కోసం సుమారు 10 నెలల పాటు విదేశాలకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు కొత్త ఇన్‌చార్జ్‌ను నియమించే అవకాశం ఉందనే టాక్ నడుస్తోంది.

మిగతాది 2 లో..

- గాంధీభవన్‌లో ఠాక్రే ప్రత్యక్షం
- ఇన్‌చార్జ్ మార్పుపై పెరిగిన ఉత్కంఠ
- మీనాక్షి స్థానంలో ఎవరొస్తారు?
- మళ్లీ ఠాక్రేకే పగ్గాలు అప్పగిస్తారా?
- అధిష్టానం నిర్ణయంపై ఆసక్తికర చర్చ
- ఇన్‌చార్జ్ రేసులో హేమాహేమీలు
- కాంగ్రెస్‌లో మార్పుపై హాట్ టాపిక్
- ఠాక్రే రాకతో కొత్త ఊహాగానాలు
- కీలక సమయంలో మార్పు చర్చ

## ప్రపంచ వేదికపై భారత్ విశ్వరూపం!

న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం

భిన్న దేశాలను ఏకతాటిపైకి తెచ్చిన భారత్

నిర్మాణాత్మక చర్చలతో ఏకాభిప్రాయం

గ్లోబల్ సౌత్‌కు భారత్ గొంతుక

పెరుగుతున్న ఆర్థిక బలానికి నిదర్శనం

మోదీ నాయకత్వంపై చంద్రబాబు ప్రశంసలు

అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠకు రెక్కలు



2 లో

**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా 'న్యూఢిల్లీ డిక్లరేషన్' ఆమోదం పొందడంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో బహుళపక్ష సంస్థలను బలోపేతం చేయడమే కాకుండా, ప్రపంచ సరఫరా వ్యవస్థలను మరింత పటిష్టం చేయడానికి ఈ వేదిక దోహదపడుతుందని ఆయ పేర్కొన్నారు. ఆవిష్కరణలు, సుస్థిరాభివృద్ధి, అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య పరస్పర సహకారాన్ని పెంచడానికి ఈ ఒప్పందం ప్రాధాన్యమివ్వడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ప్రపంచ ఆర్థిక వృద్ధిని నడిపించే కీలక శక్తులుగా ఈ అంశాలే నిలుస్తాయని ఆయన విశ్లేషించారు.

## చైనా బలగాలు తగ్గాయి.. భారత్ పటిష్టం!



2 లో

**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** వాస్తవాధీన రేఖ వెంబడి భారత్ పటిష్టమైన సైనిక మోహరింపు చేపట్టడంతో, ఉత్తర సరిహద్దుల వెంబడి చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ బలగాల మోహరింపు భారీగా తగ్గిందని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ తన వార్షిక నివేదికలో వెల్లడించింది.

## అన్ని రాష్ట్రాల్లో వందేమాతరం!

జాతీయ గేయానికి పూర్వ వైభవం

స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర

భాషల వైవిధ్యమే దేశ బలం

మాతృభాషలో ప్రాథమిక విద్య తప్పనిసరి

మరో భారతీయ భాష నేర్చుకోవాలి

భాషను రుద్దే ఉద్దేశం లేదన్న షా



2 లో

**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** ముంబైలో జరిగిన 6వ అఖిల భారత రాజభాషా సమ్మేళనంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ, జాతీయ గేయం 'వందేమాతరం' పూర్తి వైభవాన్ని పునరుద్ధరించడానికి దాదాపు 80 ఏళ్లు పట్టిందని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఈ గేయం అత్యంత కీలక పాత్ర పోషించిందని, భారతీయ సాంస్కృతిక చైతన్యంతో మరియు జాతీయ అస్తిత్వంతో ఇది అమితంగా ముడిపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అన్ని రాష్ట్రాలూ వందేమాతరాన్ని ఆలపించాల్సిందేనని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

భారతీయ భాషల ప్రోత్సాహాన్ని సాంస్కృతిక జాతీయవాదంతో అనుసంధానించిన కేంద్ర మంత్రి, మన దేశ సంస్కృతి , ఘనమైన చరిత్రపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.

## రాజస్థాన్‌లో బీజేపీకి బిగ్ షాక్!



2 లో

బీజేపీ--కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు

3,587 వార్డుల్లో బీజేపీ మద్దతుదారుల గెలుపు

3,050 వార్డులు కాంగ్రెస్ ఖాతాలోకి

2,024 వార్డుల్లో స్వతంత్రుల విజయం

జైపూర్ కార్పొరేషన్‌లో బీజేపీ జోరు

అజ్మీర్, పాలిలో కాంగ్రెస్ పాగా

బీజేపీకి షాక్.. ప్రతిపక్ష బలంపై చర్చ

# ‘బాహుబలి గణపతి’గా రేవంత్ రెడ్డి!

**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్ర వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ప్రారంభమయ్యాయి. ప్రతి వీధి, ప్రతి గ్రామం గణపతి నామస్మరణతో మారుమోగుతుండగా, వివిధ వినూత్న రూపాల్లో కొలువుదీరిన లంబోధరుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. రంగురంగుల విద్యుత్ దీపాలు, ఆకర్షణీయమైన మండపాలతో నగరం కొత్త కళను సంతరించుకుంది. అయితే, ఈసారి వినాయక చవితి వేడుకల్లో ఓ ప్రత్యేక గణేష్ మండపం అందరి దృష్టినీ ఆకర్షిస్తూ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

రేవంత్ వినాయకుడు:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రూపంలో ఓ వినాయక విగ్రహం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. హైదరాబాద్‌లో కాంగ్రెస్ నేత, మత్స్య అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ‘బాహుబలి’ సినిమాలో ప్రభాస్ శివలింగాన్ని ఎత్తుకున్న థీమ్?లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గణపతి విగ్రహాన్ని తన భుజాలపై ఎత్తుకున్నట్లుగా ఉన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజాపాలనలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఈ మండపంలో వివరిస్తూ మండపాన్ని డిజైన్ చేశారు. పొలిటికల్, డివోషనల్ రెండింటినీ మిళితం చేస్తూ వినూత్నంగా డిజైన్ చేసిన ఈ ‘బాహుబలి గణపతి’ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మాక్ అసెంబ్లీ కాదు.. చేతల్లో చూపండి!



**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ మాట తప్పారని, ఆయన్ను దళిత సమాజం ఎప్పటికీ క్షమించదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఏనాడు కేసీఆర్ దళితులను పట్టించుకోలేదని ఓట్ల కోసమే దళితకార్డు వాడారన్నారు. దళితులపై టీఆర్ఎస్ 2003 డాక్యుమెంట్ ను ఎందుకు అమలు చేయాలేదని నిలదీశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధును పట్టించుకోలేదని దుయ్యబట్టారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేసిన బీఆర్ఎస్ నేతలను ఏమనాలి? నేల కాదు మీ బుర్రను శుద్ధి చేయాలన్నారు. అంబేద్కర్ విగ్రహం పెడితే కాదు ఆయన సూచనలు పాటించాలన్నారు. దళితుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్ కు లేదన్నారు.

కొండా సురేఖకు పిలుపు మాకు సమాచారం లేదు:

మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు బీసీకి సీఎం పదవిని ఇచ్చారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తలసానిని ప్రతిపక్ష నేత చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఎలాగు అసెంబ్లీకి రావట్లేదు తలసానిని ప్రతిపక్ష నేతగా చేయాలని ప్రతిపక్ష నేత హోదా బీసీ నేతలకు ఇస్తామంటే సస్పెన్షన్ ఎత్తివేయిస్తామన్నారు. కొండా సురేఖను హైకమాండ్ పిలిచినట్లు మాకు సమాచారం లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులు ఎవరు కబ్జా చేసినా అవి బయటకు రావాలన్నారు.

# కవిత దూకుడు.. 18 ఇంచార్జిల ప్రకటన!



**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత రాష్ట్ర రాజకీయాల్లో దూకుడు పెంచారు. పార్టీ బలోపేతంపై వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల ఇంచార్జిలను ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వినాయక చతుర్థి సందర్భంగా తాజాగా మరో 18 నియోయజకవర్గాలకు ఇంచార్జిలను ప్రకటించారు. అలాగే పలు జిల్లాలకు అధ్యక్షులను సైతం నియమించారు. అంతేకాదు పార్టీ అనుబంధ విభాగాలకు కొత్త అధ్యక్షులను ప్రకటించారు. గతంతో కలిపి మొత్తం ఇప్పటి వరకు 60 నియోజకవర్గాలకు ఇంచార్జిలను కవిత నిమమించారు. మెదక్ లోక్‌సభ అధ్యక్షుడిని సైతం కల్వకుంట్ల కవిత నియమించారు.

18 నియోజవర్గాలు ఇవే..

పటాన్ చెరువు, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, కంటోన్మెంట్, నాంపల్లి, అంబర్ పేట, ఇబ్రహీంపట్నం, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, ఖానాపూర్, నిర్మల్, హుజూరాబాద్, దేవరకొండ, ఇల్లందు, అశ్వరావుపేట

# చైనా బలగాలు తగ్గాయి.. భారత్ పటిష్టం!

మొదటి పేజీ తరువాయి

పటిష్టంగా భారత సైన్యం..

సరిహద్దు వెంట సుమారు 10 కంబైండ్ ఆర్మ్స్ బ్రిగేడ్ స్థాయి బలగాలను, అలాగే సాంప్రదాయ శిక్షణా ప్రాంతాలలో మరో 10 బ్రిగేడ్‌లను చైనా మోహరించినట్లుగా నివేదిక తెలిపింది. ఇన్ఫాంట్రీ, ట్యాంకులు, ఆర్టిల్లరీ, ఎయిర్ డిఫెన్స్ వంటి వివిధ పోరాట శాఖలను ఒకే గొడుగు కింద కలిగిన యూనిట్‌ను కంబైండ్ ఆర్మ్స్ బ్రిగేడ్‌గా వ్యవహరిస్తారు. ఎల్ఏసీ వెంబడి అన్ని రంగాలల్లోనూ భారత సైన్యం అత్యంత పటిష్టంగా, పకడ్బందీగా మోహరించి ఉందని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.

# మసూద్‌పై పాక్ కపట నాటకం!

మొదటి పేజీ తరువాయి

ఎవరీ మసూద్ అజార్?



58 ఏళ్ల మసూద్ అజార్, పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు మరియు చీఫ్. గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో జరిగిన అనేక భారీ ఉగ్ర దాడుల వెనుక ఇతని హస్తం ఉంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఇతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై ఉగ్రదాడులు, 2016 పఠాన్‌కోట్ ఏర్‌బేస్ దాడి మరియు 2019 పుల్వామా దాడులతో పాటు, నవంబర్ 10, 2025న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనలోనూ ఇతని ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకప్పుడు భారత కస్టడీలో ఉన్న మసూద్ అజార్‌ను, 1999 డిసెంబర్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం హైజాక్ అయిన సమయంలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు భారత్ విడుదల చేయాల్సి వచ్చింది. ఆ తర్వాతే ఇతడు జైషే మహమ్మద్ సంస్థను స్థాపించాడు.

ఫాట్ఫ్ సమావేశం వేళ కీలక పరిణామం

పారిస్ వేదికగా అక్టోబర్ 26 నుండి 30, 2026 వరకు ‘ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్’ ప్లీనరీ సమావేశాలు జరగనున్నాయి. ఉగ్ర నిధుల సరఫరా, మనీ లాండరింగ్ నిరోధక చర్యలపై దేశాల పురోగతిని ఈ సమావేశాల్లో సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ఈ చర్య తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆపరేషన్ సిందూర్‌లో తప్పించుకున్న అజార్

పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా మే 7న భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ వైమానిక దాడుల్లో బహావల్పూర్‌తో సహా తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో మసూద్ అజార్ తృటిలో ప్రాణాలతో బయటపడినప్పటికీ, అతని అక్క, బావ, మేనల్లుడు, మేనకోడలు, ఐదుగురు పిల్లలతో సహా మొత్తం 10 మంది కుటుంబ సభ్యులు, నలుగురు ముఖ్య అనుచరులు హతమయ్యారు.

# ప్రపంచ వేదికపై భారత్ విశ్వరూపం!

మొదటి పేజీ తరువాయి

విభిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ...



భిన్నమైన రాజకీయ, ఆర్థిక భావజాలాలు కలిగిన ప్రపంచ దేశాలను ఒకే తాటిపైకి తీసుకురావడంలో భారత్ విజయం సాధించిందని చంద్రబాబు కొనియాడారు. విభిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ, అందరినీ ఒకే వేదికపై కూర్చోబెట్టి నిర్మాణాత్మక చర్చలు జరపడం, చివరికి ఏకాభిప్రాయానికి తీసుకురావడంలో భారతదేశం ఒక విశ్వసనీయమైన శక్తిగా అవతరించిందని చెప్పారు. గ్లోబల్ వేదికపై మన దేశం చూపుతున్న ఈ సమర్థత, దౌత్య విజయం అంతర్జాతీయంగా భారత్ పట్ల ఉన్న నమ్మకాన్ని మరింత పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు.

గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకగా భారత్

అంతర్జాతీయ స్థాయిలో బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సయోధ్య కుదర్చడం, ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడం అనేది భారతదేశం యొక్క పెరుగుతున్న ఆర్థిక బలానికి, మారుతున్న అంతర్జాతీయ ప్రాధాన్యతకు స్పష్టమైన నిదర్శనమని సీఎం వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సదస్సును అత్యంత ఘనంగా, విజయవంతంగా నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మోదీ దౌత్య విధానాలు, సమర్థవంతమైన నాయకత్వం వల్లనే గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకగా భారత్ నిలబడగలిగిందని ప్రశంసించారు.

ఎన్నడూ లేనంతగా..

నేడు ప్రపంచ వేదికపై భారతదేశం వినిపిస్తున్న స్వరం గతంలో ఎన్నడూ లేనంత ఆత్మవిశ్వాసంతో, గంభీరమైన గౌరవంతో ఉనికి చాటుకుంటోందని చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ సమస్యలపై భారత్ తీసుకుంటున్న నిర్ణయాలు, చూపుతున్న పరిష్కారాలు ప్రపంచ దేశాలను ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. ఈ బ్రిక్స్ సదస్సు విజయవంతం కావడం ద్వారా గ్లోబల్ లీడర్‌గా భారతదేశం యొక్క ప్రతిష్ఠ, స్థాయి అంతర్జాతీయ సమాజంలో మరిన్ని శిఖరాలకు చేరుకుందని ఆయన ముగించారు.

# అన్ని రాష్ట్రాల్లో వందేమాతరం!

మొదటి పేజీ తరువాయి



దేశంలోని భాషా వైవిధ్యాన్ని భిన్నత్వంగా గాక, దేశ ఐక్యతకు మూలమైన గొప్ప బలంగా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన విద్యా విధానం ప్రాముఖ్యతను వివరించిన అమిత్ షా, దీనిపై వస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు తమ మాతృభాషతో పాటు మరొక భారతీయ భాషను నేర్చుకోవాలని ప్రోత్సహించే విద్యా విధాన నిబంధనను సమర్థిస్తూ, ఈ నిబంధనను వ్యతిరేకించేవారు పెద్ద పాపం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విద్యా విధానం ఉద్దేశం ఏ ఒక్క నిర్దిష్ట భాషనూ బలవంతంగా రుద్దడం కాదని, భారతీయులందరూ ఒకరి భాషలు, సంస్కృతుల పట్ల పరస్పర అవగాహన, ఆప్యాయతలను పెంపొందించుకోవడానికేనని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ నూతన విద్యా విధానం ద్వారా ప్రాథమిక విద్యను మాతృభాషలోనే బోధించడాన్ని తప్పనిసరి చేసిందని తెలిపారు.

మహారాష్ట్రలోని విస్తృతమైన భాషా వైవిధ్యాన్ని అమిత్ షా ప్రత్యేకంగా కొనియాడారు. దేశంలోనే మహారాష్ట్రను అత్యంత ప్రాధాన్యత కలిగిన బహుళ భాషా ప్రాంతంగా అభివర్ణించిన ఆయన, ఇక్కడ కొంకణి, గుజరాతీ, సింధీ, హిందీ, కన్నడ మరియు వార్లీ వంటి అనేక భాషలు ఏకకాలంలో వర్ధిల్లాయని, గౌరవాన్ని పొందాయని గుర్తుచేశారు. మహారాష్ట్ర కంటే పెద్ద బహుభాషా ప్రాంతం దేశంలో మరొకటి లేదని వ్యాఖ్యానించారు. మరాఠీ భాషకున్న ప్రాచీన సాహిత్య మరియు చారిత్రక వారసత్వాన్ని గుర్తించి, దానికి ‘ప్రాచీన భాష’ హోదాను కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీనే స్వయంగా చొరవ తీసుకున్నారని హోంశాఖ మంత్రి గుర్తుచేశారు. విద్య, పరిపాలన మరియు ప్రజా జీవనంలో భారతీయ భాషలను మరింతగా విస్తరించడం ద్వారా భాషలు, చరిత్ర, జాతీయ అస్తిత్వం మధ్య ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలపరచడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు.

# రాజస్థాన్‌లో బీజేపీకి బిగ్ షాక్!



**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** రాజస్థాన్‌లో జరిగిన స్థానిక ఎన్నికల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ నెలకొంది. బీజేపీ మద్దతుదారులు 3, 587 వార్డుల్లో విజయం సాధించగా.. కాంగ్రెస్ 3,050 వార్డుల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థులు 2,024 వార్డుల్లో అభ్యర్థులు విజయ కేతనం ఎగురవేశారు. జైపూర్ కార్పొరేషన్‌లో బీజేపీ, జల్వాల్ మున్సిపాలిటీతో పాటు అజ్మీర్, పాలిని సైతం కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంది. దీంతో బీజేపీ గెలుపొందిన వార్డులకంటే కాంగ్రెస్, ఇతరులకే ఎక్కువ సీట్లు రావడం రాజస్థాన్ రాజకీయాల్లో సంచలనంగా మారింది. స్థానికంగా అధికార బీజేపీపై ప్రజా వ్యతిరేకత స్పష్టం కనిపిస్తోందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరి వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇతరుల బలాన్ని తట్టుకుని మళ్లీ నిలబడుతుందేమో చూడాలి.

# ‘రౌడీ రాజ్యం’.. కేటీఆర్, హరీశ్ ఫైర్!



**న్యూస్ డెస్క్,14 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద చోటు చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏతో పాటు పీఆర్వోను సోమవారం విచారించారు. మహేందర్ రెడ్డి, మహేశ్‌ను ఉదయం నుంచి సుదీర్ఘంగా ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చి విచారణకు సహకరించాలని పేర్కొన్నారు. అయితే పోలీస్ స్టేషన్‌లో తమ దాడికి పాల్పడ్డారని మహేందర్ రెడ్డి, మహేశ్ ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మరోవైపు మహేశ్ రెడ్డి, మహేశ్ పట్ల వ్యవహరించిన తీరును మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఖండించారు. తప్పులను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని హరీశ్ రావు ప్రశ్నించారు. గుర్తు తెలియని వ్యక్తులు వస్తే పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. దాడి ఘటన సీసీ ఫుటేజ్‌లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లోనే మహేందర్ రెడ్డి, మహేశ్ దాడి జరిగిదంటే సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని హరీశ్ రావు సూచించారు.

మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రౌడీల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు. మహేందర్, మహేందర్ పై దాడి యత్నం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సీఎం రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని కేటీఆర్ సూచించారు. ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, మహేందర్, మహేశ్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# మైనర్ బాలికపై నరరూప రాక్షసుల దాడి!



**న్యూస్ డెస్క్, 14 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ నగరంలోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నరరూప రాక్షసుల దారుణం వెలుగులోకి వచ్చింది. ఒక మైనర్ బాలికపై విక్కీ అనే యువకుడు, అతడి గ్యాంగ్ కలిపి ఏకంగా తొమ్మిది మంది మూడు రోజుల పాటు దారుణంగా గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ఘోర ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దారుణానికి సంబంధించి దర్యాప్తు వివరాల ప్రకారం.. ఈ నెల 8వ తేదీన విక్కీ అనే యువకుడు మైనర్ బాలికకు మత్తుమందు ఇచ్చి అపహరించుకుపోయాడు. ఆమెను గుండ్లపోచంపల్లిలోని ఒక ఓయో హోటల్‌కు తీసుకెళ్లి, ఆమెకు గంజాయి తాగించి విక్కీతో సహా నలుగురు కలిసి మొదటి రోజు దారుణంగా అత్యాచారం చేశారు. ఆ తర్వాత మరుసటి రోజు (9వ తేదీన) బాలికను షామీర్‌పేటలోని ఒక నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌కు తరలించి, అక్కడ విక్కీతో పాటు మరో ఇద్దరు కలిసి గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు.

అనంతరం 10వ తేదీన మేడ్చల్‌లో ఆగి ఉన్న ఒక రైలులోకి తీసుకువెళ్లి, విక్కీతో సహా మరిద్దరు కలిసి బాలికపై మళ్లీ లైంగిక దాడికి ఒడిగట్టారు. ఇలా మూడు రోజుల వ్యవధిలో మూడు వేర్వేరు ప్రాంతాలకు తిప్పుతూ, గంజాయి, మత్తు పదార్థాలు ఇస్తూ మొత్తం 9 మంది ఈ ఘోరానికి పాల్పడ్డారు. బాధితురాలి పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అల్వాల్ పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన విక్కీ అండ్ గ్యాంగ్‌లోని 9 మంది యువకులపై పోక్సో చట్టంతో పాటు తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు పలువురిని అరెస్ట్ చేశారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకునేందుకు బేగంపేట ఏసీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఇక, ఈ ఘటనలో మైనర్ బాలికను హోటల్‌లోకి అనుమతించి, ఎలాంటి వివరాలు లేకుండా గది కేటాయించినందుకు గాను గుండ్లపోచంపల్లిలోని సదరు ఓయో హోటల్ మేనేజర్ మరియు ఓనర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# తెలంగాణలో కొత్త చట్టం.. ‘క్యూర్’ షురూ!

మొదటి పేజీ తరువాయి

అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్..

క్యూర్ పరిధిలో పట్టణ ప్రాంతాల అభివృద్ధి విష యంలో అజెండా, విజన్, దిశ, దశను నిర్దేశించడానికి అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని చట్టంలో పొందుపర్చారు. దీనికి సీఎం చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కన్వీనర్‌గా పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి, పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సభ్యునిగా ఉంటారు. దీంతోపా టు అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్‌లో సభ్యులను సీఎం నియమించనున్నారు. ఈ కౌన్సిల్ క్యూర్ పరిధిలోని రంగా లు, విభాగాలకు సంబంధించిన విధివిధానాలు, పథకా లు, పెట్టుబడుల సమన్వయం వంటి అంశాలను రూపొందించనుంది.

ఎగ్జిక్యూటివ్ కమిటీ..

అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ నిర్ణయాలు, ఆదేశాలను అమలు చేయడానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా అధికారులతో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కమిషనర్లు, హైదరాబాద్ సిటీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ, టీజీఆర్టీసీ ఎండీ, హైడ్రా కమిషనర్ వ్యవహరించనున్నారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకొకసారి తప్పకుండా సమావేశం కావాలి. ఈ కమిటీలో ఇతర వ్యక్తులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడానికి చైర్మన్‌కు అధికారాలు కల్పించారు. ఈ కమిటీ క్యూర్ పరిధిలో చేయాల్సిన ముఖ్యమైన పనులను గుర్తించడంతోపాటు వాటిని అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్‌కు సిపార్సు చేయాల్సి ఉంటుంది. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల మధ్య సమన్వయం చేయడంతోపాటు కమిటీలోని అన్ని శాఖలను సైతం సమన్వయం పనిచేయాల్సి ఉంటుంది.

# గాంధీభవన్‌లో గుసగుసలు!

మొదటి పేజీ తరువాయి

పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు:

మీనాక్షి నటరాజన్ మార్పు అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా స్పందించారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన సమయంలో మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లబోతున్నట్లు తెలుస్తోందని, అయితే ఈ విషయంలో ఏఐసీసీ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందో తమకు తెలియదని ఆయన పేర్కొన్నారు.

మీనాక్షి స్థానంలో ఎవరు?

మీనాక్షి నటరాజన్ 2025 ఫిబ్రవరి 14న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు మాణిక్‌రావు ఠాక్రే రాష్ట్ర పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన స్థానంలో దీపా దాస్‌మున్షీని ఏఐసీసీ నియమించింది. అనంతరం దీపా దాస్‌మున్షీ స్థానంలో మీనాక్షి నటరాజన్‌కు తెలంగాణ బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు మీనాక్షి విదేశాలకు వెళ్లనున్న నేపథ్యంలో కొత్త ఇన్‌చార్జ్‌ను నియమించే అంశంపై ఏఐసీసీ కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రేసులో ముకుల్ వాస్నిక్, దిగ్విజయ్ సింగ్, శక్తిసింహ్ గోహిల్, అశోక్ గెహ్లాట్ పేర్లు వినిపిస్తుండగా గాంధీ భవన్ లో పూజా కార్యక్రమానికి మాణిక్ రావు హాజరుకావడంతో అధిష్ఠానం రాష్ట్ర ఇన్ చార్జిగా మరోసారి థాక్రేనే పంపబోతోందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కీలక సమయంలో ఇన్‌చార్జ్ మార్పు?

మీనాక్షి నటరాజన్ స్థానంలో మరో ఇన్చార్జి నియామకం జరిగితే అది కీలక సమయంలో మార్పుగా మారనుంది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల మధ్య విభేదాలు బహిరంగంగానే కనిపిస్తున్నాయి. మరోవైపు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సి ఉంది. మరో రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలు కూడా ఎదురుకానున్నాయి. ఇలాంటి కీలక సమయంలో రాష్ట్ర కాంగ్రెస్‌ను సమన్వయం చేస్తూ పార్టీ నేతలను ఏకతాటిపైకి తీసుకెళ్లే బాధ్యతను అధిష్ఠానం ఎవరికి అప్పగిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ప్రధాని మోడీ ఒక్క ప్రకటనతో చైనాలో ఆనందం..

**న్యూస్ డెస్క్,14 సెప్టెంబరు (తెలుగు గళం):** భారత్–చైనా సంబంధాలపై చైనా కీలక వ్యాఖ్యలు చేసింది. భారత విదేశాంగ విధానం స్వతంత్రమైందని, ఏ మూడో దేశం ప్రభావంతోనూ భారత్–చైనా సంబంధాలు నడవకూడదని ప్రధాని నరేంద్రమోడీ చేసిన ప్రకటనపై బీజింగ్ ప్రశంసలు కురిపించింది. ఇరు దేశాలు భాగస్వాములుగా ముందుకు సాగాలని డ్రాగన్ కంట్రీ ఆకాంక్షించింది. న్యూఢిల్లీ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. ఈ సమావేశాల్లో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోడీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ మధ్య ద్వైపాకిక్ష చర్చలు నడిచాయి.

ఈ భేటీ భారత్, చైనా సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంతో ముందడుగుగా చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గ్వో జియాకున్ అభివర్ణించారు. గత ఏడేళ్లలో జిన్‌పింగ్ భారత్ పర్యటించడం ఇదే తొలిసారిన, అలాగే గత మూడేళ్లలో మోడీ, జిన్‌పింగ్ మధ్య మూడో సమావేశం అని చెప్పారు. భారత విదేశాంగ విధానం స్వతంత్రమైందని, ఎవరి ఒత్తిడికి గురికాకుండా నిర్ణయాలు తీసుకుంటుందని ప్రధాని మోడీ పేర్కొన్నట్లుగా జియాకున్ తెలిపారు. భారత భూభాగం నుంచి చైనా వ్యతిరేక కార్యకలాపాలను భారత్ అనుమతించదని మోడీ చెప్పినట్లు చైనా పేర్కొంది. ఈ వ్యాఖ్యలకు చైనా ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు.

ఇదే సమయంలో భారత్, చైనాలు భాగస్వాములుగా ముందుకు సాగాలని మోడీ–జిన్‌పింగ్ సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయమని గ్వోజియాకున్ చెప్పారు. కజాన్‌లో ఇరు దేశాల మధ్య చర్చలు మళ్లీ ప్రారంభమయ్యాయని, టియాంజిన్‌లో, ఇప్పుడు ఢిల్లీలో కూడా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఇరువురు నాయకులు ఆర్థిక, వాణిజ్య అంశాలపై చర్చలు జరిపినట్లు చైనా తెలిపింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న రెండు దేశాలు గ్లోబల్ సౌత్‌లో కీలక పాత్ర పోషిస్తున్న?్నయని పేర్కొంది. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వాన్ని కాపాడుకోవడం అత్యవసరమని ఇరు దేశాలు భావిస్తున్నట్లు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# బాలగంగాధర్ తిలక్ ఆలోచనే నేటి బ్రహ్మాండమైన గణేష్ ఉత్సవం





నేడు మనం గణేష్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. భారీ విగ్రహాలు, విద్యుత్ దీపాలంకరణలు, డీజేలు, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలతో గణేష్ నవరాత్రులు సందడిగా సాగుతున్నాయి. అయితే 1893 సంవత్సరంలో గణేష్ ఉత్సవాలు ఇదే రూపంలో ఉండేవా? అంటే కచ్చితంగా కాదు. అప్పట్లో గణపతి పండుగ ప్రధానంగా కొన్ని కుటుంబాల ఇళ్లకే పరిమితమై ఉండేది. ముఖ్యంగా బ్రాహ్మణ కుటుంబాలు, కొన్ని సంపన్న కుటుంబాల్లో గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేసేవారు. అది కూడా సాధారణంగా ఒకరోజు పండుగగానే ఉండేది. నేటి మాదిరిగా సామూహికంగా, నవరాత్రులపాటు పెద్ద ఎత్తున నిర్వహించే సంప్రదాయం అప్పట్లో లేదు. అదే సమయంలో భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉంది. ప్రజలు ఒకచోట చేరడం, సమావేశాలు నిర్వహించడం వంటి వాటిపై ఆంక్షలు ఉండేవి. ప్రజలను ఒక వేదికపైకి తీసుకురావడం అంత సులభమైన విషయం కాదు. ఈ పరిస్థితిని గమనించిన ఒక ఆలోచన చేశారు. ఇంట్లోనే గణపతిని ప్రతిష్ఠిస్తే ఆ పూజ ఆ కుటుంబానికే పరిమితం అవుతుంది. అదే గణపతిని బహిరంగ ప్రదేశంలో ప్రతిష్ఠించి సామూహికంగా ఉత్సవాలు నిర్వహిస్తే ప్రజలందరినీ ఒకచోటకు తీసుకురావచ్చు అని ఆయన భావించారు. అలా గణేష్ ఉత్సవం కేవలం ఒక మతపరమైన కార్యక్రమంగా కాకుండా, ప్రజలను సమీకరించే సామాజిక వేదికగా మారింది. తిలక్ ఈ వేదిక ద్వారా జాతీయ భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దేశభక్తి గీతాలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు వంటి వాటి ద్వారా ప్రజల్లో స్వరాజ్య భావనను, స్వీయ పాలన ఆకాంక్షను పెంపొందించేందుకు కృషి చేశారు. ఆ కాలంలో కుల, సామాజిక విభేదాలతో విడిపోయిన ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడం కూడా తిలక్ లక్ష్యాల్లో ఒకటిగా చెప్పవచ్చు. హిందూ దేవతలు, సాంస్కృతిక చిహ్నాలను ఉపయోగించుకుని ప్రజల్లో ఐక్యత, జాతీయ గర్వం, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకమైన చైతన్యాన్ని పెంపొందించేందుకు ఆయన ప్రయత్నించారు. అందువల్ల తిలక్ ఆలోచనలో గణేష్ ఉత్సవం కేవలం వినాయకుడిని ప్రతిష్ఠించడం కాదు; ప్రజలను ఒకచోట చేర్చడం, వారిలో సామాజిక చైతన్యం కలిగించడం, జాతీయ భావాన్ని పెంపొందించడం కూడా. కాలక్రమంలో స్వాతంత్ర్య ఉద్యమం ముగిసింది. భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. అయినప్పటికీ గణేష్ ఉత్సవాల సంప్రదాయం కొనసాగింది. అయితే దాని రూపం క్రమంగా మారింది. భక్తి గీతాలు, భజనలు, పురాణ ప్రవచనాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాల్లో భాగమయ్యాయి. తెలియని విషయాలను ప్రజలకు తెలియజేసే వేదికగా కూడా కొన్ని ప్రాంతాల్లో గణేష్ మండపాలు ఉపయోగపడుతున్నాయి. నేడు యువత గణేష్ ఉత్సవాలను నిర్వహించేందుకు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తోంది. భారీ విగ్రహాలు, గొప్ప అలంకరణలు, భారీ కార్యక్రమాల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో తప్పేమీ లేదు. కానీ తిలక్ ఆలోచనకు అసలైన అర్థం రావాలంటే ఆ ఉత్సవం ద్వారా సమాజానికి మనం ఏమి అందిస్తున్నాం? అనే ప్రశ్న కూడా మనల్ని మనం వేసుకోవాలి. విగ్రహం ఎంత పెద్దది? అలంకరణ ఎంత ఘనంగా ఉంది? ఎవరి గణపతి గొప్పది? అనే పోటీ కంటే, మన గణేష్ మండపం ద్వారా ఎంతమందికి మంచి విషయాలు తెలియజేశాం? ఎంతమందిలో చైతన్యం కలిగించాం? మన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, వారసత్వాన్ని మన తరువాతి తరాలకు ఎంతవరకు పరిచయం చేశాం? అనే విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని ప్రతిష్ఠిస్తున్నాం. మరి సమాజంలో ఉన్న ఏ విఘ్నాలను తొలగించడానికి మనం ప్రయత్నిస్తున్నాం? అజ్ఞానం, మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలు, పర్యావరణ కాలుష్యం, మాదకద్రవ్యాల వ్యసనం, విద్యా లోపం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించగలిగితే ఆ గణేష్ ఉత్సవానికి మరింత అర్థం ఉంటుంది. గణపతి విగ్రహం చిన్నదైనా పెద్దదైనా ముఖ్యం కాదు. ఆ విగ్రహం ముందు మనం చూపించే భక్తి, శ్రద్ధతో పాటు సమాజానికి అందించే సందేశమే ముఖ్యమైనది. నాడు బాలగంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాన్ని ప్రజలను ఏకం చేసే వేదికగా ఆలోచించారు. నేడు అదే వేదికను మనం భక్తితో పాటు సామాజిక చైతన్యానికి, జ్ఞానానికి, సంస్కృతి పరిరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు, యువతలో బాధ్యత పెంపొందించడానికి ఉపయోగించగలిగితే తిలక్ ఆలోచనకు నిజమైన గౌరవం ఇచ్చినట్లవుతుంది. గణపతి ఉత్సవం అంటే కేవలం గణపతిని తీసుకురావడం కాదు...గణపతి పేరుతో మంచి ఆలోచనలను సమాజంలోకి తీసుకురావడం. అదే తిలక్ ఆలోచనకు నేటి తరంలో నిజమైన కొనసాగింపు.



రాయపర్తి భానుప్రసాద్
-తెలుగు గళం దినపత్రిక
– ఈ69న్యూస్ తెలంగాణ బ్యూరో చీఫ్

# టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో ఘనంగా గణపతి ఉత్సవాలు

తెలుగు గళం న్యూస్ హనుమకొండ, సెప్టెంబర్ 14



హనుమకొండ నక్కలగుట్టలోని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో వినాయక చవితి సందర్భంగా గణపతి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సంస్థ క్లస్టర్ హెడ్ వేముల వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అవసరాన్ని తెలియజేస్తూ, ప్రతి ఒక్కరికీ జీవిత బీమా అందించాలనే లక్ష్యంతో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో క్లస్టర్ హెడ్ వేముల వినోద్ కుమార్‌తో పాటు బ్రాంచ్ మేనేజర్లు కొయ్యాడ లక్ష్మణ్, గరిపెల్లి శ్రీనివాస్, మామిడాల అనిల్, బీఏ మేనేజర్లు, లీడర్లు, అడ్వైజర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, సంస్థ ప్రతినిధులు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే ముద్దు




లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితం మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్ సెప్టెంబర్ 14

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని, రసాయనిక రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను పూజించాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జఫర్‌గడ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ జఫర్‌గడ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ మామిడాల పూర్ణచందర్ మాట్లాడుతూ..రసాయనిక రంగులతో కూడిన విగ్రహాలను చెరువులు, నదులు, ఇతర నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని సూచించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ప్రకృతిని పరిరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆయన కోరారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ అంచు యుగంధర్, మార్కెటింగ్ కోఆర్డినేటర్ భువనగిరి శ్రవణ్ కుమార్, డైరెక్టర్ పాలకుర్తి నాగార్జున, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ మంచాల ఎల్లయ్య, జాయింట్ సెక్రటరీ దాంశెట్టి సోమేశ్వర్, లియో కోఆర్డినేటర్ బైరి వెంకటేశ్వర్లు, మాస్టర్ చైర్మన్ ఎదులాపురం మదన్‌మోహన్, ముక్కాల భాస్కర్‌రెడ్డి, బజ్జూరి సంతోష్‌కుమార్, జీఎల్‌టీ కోఆర్డినేటర్ రొడ్డ రాజు, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ మాద శ్రీధర్, వినాయక విగ్రహ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భక్తి..ఆనందం..చిన్నారుల సందడి

## నారాయణ సత్తుపల్లిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు"



సత్తుపల్లి,ఆర్ సి, సెప్టెంబర్14 (తెలుగు గళం) న్యూస్ :



భక్తి, ఆనందం, చిన్నారుల సందడితో నారాయణ సత్తుపల్లి పాఠశాలలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు ఉత్సాహంగా ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని వేడుకలకు మరింత శోభను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏజీఎం రామ్కీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లలు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి మాట్లాడుతూ, మన పండుగలు ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, సంతోషం, సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. పండుగల ప్రత్యేకతను విద్యార్థులకు వివరించి, వారు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణం భక్తి, ఆనందంతో నిండిపోయింది. విద్యార్థుల ఉత్సాహభరితమైన ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో: ఆర్.ఐ క్రాంతి,కోఆర్డినేటర్లు ప్రవీణ్, వినోద లక్ష్మి, నీలిమ, ఉపాధ్యాయులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# బెదిరింపులు..దాడులు..అయినా ఎర్రజెండాను వీడని యోధుడు చీనూరు వెంకటయ్య

- తమ్మడపల్లి జి గ్రామ సీపీఎం సీనియర్ నాయకుడు చీనూరు వెంకటయ్య కన్నుమూత
- 1967 నుంచి చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలకే అంకితం



తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ సెప్టెంబర్ 14

దాడులు ఎదురైనా..ఇంటిని తగలబెట్టినా..ప్రాణహాని బెదిరింపులు వచ్చినా..తాను నమ్మిన సిద్ధాంతం నుంచి అడుగు వెనక్కి వేయని కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు, సీపీఎం తమ్మడపల్లి (జి) గ్రామ సీనియర్ నాయకుడు కామ్రేడ్ చీనూరు వెంకటయ్య కన్నుమూశారు. అనారోగ్యంతో సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో సీపీఎం శ్రేణుల్లో విషాదం అలుముకుంది. 1967లో సీపీఎం పార్టీ సభ్యత్వం స్వీకరించిన వెంకటయ్య..దాదాపు ఆరు దశాబ్దాల పాటు తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అంకితమై పనిచేశారు. తమ్మడపల్లి (జి) గ్రామంలో పార్టీ నిర్మాణానికి పునాదులు వేసిన నాయకుల్లో ఆయన ఒకరు. గ్రామ కార్యదర్శిగా,మండల కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాల్లో పాల్గొన్నారు.

### ఇంటిని తగలబెట్టినా..పార్టీని వీడలేదు

వెంకటయ్య రాజకీయ జీవితంలో ఎన్నో నిర్బంధాలు, దాడులు, బెదిరింపులు ఎదురయ్యాయి. 1987లో కాంగ్రెస్ గుండాలు ఆయన ఇంటిని తగలబెట్టినప్పటికీ ఆయన వెనుకడుగు వేయలేదు. పార్టీ కోసం వ్యక్తిగతంగా నష్టాన్ని భరించినా, సీపీఎం జెండాను మాత్రం వీడలేదు. 1997లో సీపీఎం పార్టీకి రాజీనామా చేయాలని, లేదంటే ప్రాణాలు తీస్తామని, ఇంటిని బాంబులతో పేల్చివేస్తామని నక్సలైట్లు బెదిరించినా ఆయన ఏమాత్రం భయపడలేదు. "చంపితే చంపండి.. ఇల్లు బాంబులతో పేల్చేస్తే పేల్చేయండి.. నేను మాత్రం సీపీఎం పార్టీకి రాజీనామా చేయను" అంటూ ధైర్యంగా సమాధానం చెప్పిన ఆయన నిబద్ధత పార్టీ చరిత్రలో నిలిచిపోయే సంఘటనగా నాయకులు గుర్తుచేశారు.

### ఉద్యమానికి తీరని లోటు

చీనూరు వెంకటయ్య మృతి తమ్మడపల్లి (జి) గ్రామంలో సీపీఎం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు పేర్కొన్నారు. ఆయనకు పార్టీ జిల్లా కమిటీ తరపున విప్లవ



జోహార్లు అర్పిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటయ్య ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. వెంకటయ్య భౌతికకాయంపై సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎండీ షబానా, జఫర్గఢ్ మండల కార్యదర్శి గుండె బోయిన రాజు, మండల కమిటీ సభ్యులు గంగరాజు (ఉపసర్పంచ్), గ్రామ కార్యదర్శి వేల్పుల రవి, వడ్లకొండ రాజు, ఎండీ శంషుద్దీన్, పులిగిల్ల నాగరాజు, రాపర్తి మల్లేష్, వేల్పుల రాములు, ఎండీ భాష, అంక్షావలి, ప్రభాకర్ తదితరులు నివాళులర్పించారు. తన జీవితాన్ని పార్టీకి..ప్రజా ఉద్యమానికి అంకితం చేసిన చీనూరు వెంకటయ్యకు సీపీఎం శ్రేణులు విప్లవ జోహార్లు అర్పించారు.

# ఖైరతాబాద్‌లో కొలువుదీరిన బడా గణేశ్.. గవర్నర్ దంపతుల తొలిపూజ



హైదరాబాద్ (ఖైరతాబాద్): వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో 70 అడుగుల ఎత్తులో 'పంచముఖ సంకటహర మహాగణపతి' కొలువుదీరాడు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా దంపతులు తొలి పూజ చేశారు. తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, కమిటీ సభ్యులు గవర్నర్ దంపతులకు స్వాగతం పలికి విగ్రహం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం అర్చకులు గవర్నర్ దంపతులతో పూజలు చేయించారు. ఖైరతాబాద్ గణనాథుడికి మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు.



ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలు మహారాష్ట్రలో ప్రారంభమైనప్పటికీ, ఖైరతాబాద్ గణేశుడి విగ్రహానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 72 ఏళ్లుగా ఇక్కడ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించడం విశేషమన్నారు. ప్రజలంతా గణపతి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలని గవర్నర్ ఆకాంక్షించారు.

మరోవైపు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వినాయకుడికి భారీ కండువా, యజ్ఞోపవీతం సమర్పించారు. బడా గణేశ్ దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుండటంతో ఖైరతాబాద్ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

తెలుగు గళం

మంగళవారం,
15 సెప్టెంబర్ 2026



# సెప్టెంబర్ 17 పోరాట చరిత్రపై బీజేపీకి మాట్లాడే అర్హత లేదు

- ఆనాడు రైతాంగ పోరాటంలో ఆర్ఎస్ఎస్ నాయకులెవరూ పాల్గొనలేదు
- సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్ సెప్టెంబర్ 14

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే హక్కు బీజేపీకి లేదని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు.సోమవారం రంగరాయగూడెం, కోమటిగూడెం గ్రామాల్లో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనతో పాటు దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన పోరాటంలో కమ్యూనిస్టులు ప్రజలను సంఘటితం చేసి ముందుండి నడిపించారని తెలిపారు.ప్రజలు వెట్టిచాకిరీ, దోపిడీ, చిత్రహింసలకు గురవుతున్న సమయంలో ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఏ ఒక్క నాయకుడు కూడా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొనలేదని విమర్శించారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం హిందూ--ముస్లిం ఘర్షణ కాదని, దొరలు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పేదలు, రైతులు, కూలీలు సాగించిన ప్రజా పోరాటమని స్పష్టం చేశారు. కమ్యూనిస్టుల పాత్రను చరిత్ర నుంచి చెరిపివేయాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు అంగీకరించరని అన్నారు.భూమి, భుక్తి, విముక్తి కోసం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన పోరాటంగా వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ఆయన అభివర్ణించారు.పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాల భూమి పంచబడిందని, సుమారు 3 వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని, 4 వేల మంది అమరులయ్యారని గుర్తుచేశారు. ఆ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ సీపీఎం నేటికీ ప్రజా సమస్యలపై పోరాడుతోందన్నారు. చరిత్రను వక్రీకరించి మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఈ నెల 17న జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని చెప్పారు.రైతులు, కూలీలు, కార్మికులు, యువత, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కత్తుల రాజు, రంగరాయిగూడెం ఉపసర్పంచ్ మునిగెల నరసింహులు, కోమటిగూడెం శాఖ కార్యదర్శి ఈదునూరి యాకయ్య, బోయినిగూడెం శాఖ కార్యదర్శి బోయిని రాజు, పార్టీ నాయకులు నెలమంచ వెంకటరెడ్డి, మారబోయిన మల్లయ్య, బోయిని రాజయ్య, మంద ఇలిషన్, జిల్లాపెల్లి కొమురయ్య, రాడపాక యాదగిరి, మల్లారెడ్డి, బోయిని మ్యాకల కుమార్, పల్లెపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 19న కోదాడలో మెగా జాబ్ మేళా..



నల్లగొండ (తెలుగు గళం): నిరుద్యోగ యువతకు ఉద్యోగావికాషాలు కల్పించేందుకు ఈ నెల 19 న సూర్యాపేట జిల్లా కోదాడ లో పెద్ద ఎత్తున జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు.. నీటి పారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో సింగరేణి కంపెనీ, పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళా లో ఐటి, సేవా, నిర్మాణ, వాణిజ్య, ఫార్మారంగలకు చెందిన 300 కి పైగా కంపెనీలు హాజరుకానుండగా, సుమారు 4000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు పక్కన ఉన్న ఖమ్మం జిల్లా నుండి నిరుద్యోగ యువత ఇట్టి ఉద్యోగాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.. కోదాడ సీసీ రెడ్డి కాన్వెంట్ స్కూల్లో జరిగే ఈ నిరుగ్యోగ మేళా ఉదయం 9 గంటల నుండి రాత్రి 9:00 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని ఇంటర్వ్యూలలో ఉద్యోగం సంపాదించిన వారికి వెంటనే ఆర్డర్స్ నియామక పత్రాలు ఇవ్వబడుతాయని అన్నారు.

# శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలి: జిల్లా ఎస్పీ



నల్లగొండ (తెలుగు గళం): వినాయక నవరావినాయక నవరాత్రి ఉత్సవాలనుత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కోరారు... ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా పలు గణేష్ మంటపాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో నల్లగొండ నగర ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ పాల్గొన్నారు.. ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు.

ప్రజలు పండుగను ఆనందంగా, సోదరభావంతో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇందుకోసం జిల్లా పోలీసు శాఖ తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు..

# చల్వాక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరతపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- హాస్పిటల్ ఉంది.. వైద్య సిబ్బంది లేరు! ఆదివాసీ ప్రజలకు అత్యవసర వైద్యం కరువు
- డిప్యూటేషన్ల పేరుతో ఖాళీగా పీహెచ్‌సీ.. అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలి:

--తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షులు కోరం సుధాకర్ డిమాండ్







తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు, సెప్టెంబర్ 14:

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక--రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది కొరత కారణంగా చుట్టుపక్కల ఆదివాసీ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఏటూరునాగారం మండల ఉపాధ్యక్షులు కోరం సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో విషజ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు పెరుగుతున్న సమయంలో పీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందకపోవడం ఆందోళనకరమన్నారు. హాస్పిటల్‌లో సిబ్బంది కొరత గురించి అడిగితే కొంతమంది సిబ్బంది“సిబ్బంది తక్కువగా ఉన్నారు.. మిగతావారు డిప్యూటేషన్‌పై వెళ్లారు” అని సమాధానం చెబుతున్నారని తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో విధులు కేటాయించి జీతాలు పొందుతున్న సిబ్బంది ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించడం వల్ల మారుమూల ఆదివాసీ ప్రజలు అత్యవసర వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మంత్రి సీతక్క, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) వెంటనే స్పందించి చల్పాక పీహెచ్‌సీపై సమగ్ర విచారణ చేపట్టాలని, విధులకు గైర్హాజరవుతున్న లేదా నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్‌లో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరం సుధాకర్ డిమాండ్ చేశారు. పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ సిబ్బంది, ఇతర అవసరమైన పోస్టులన్నింటినీ తక్షణమే భర్తీ చేసి, ఆస్పత్రిని పూర్తి స్థాయి సిబ్బందితో నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి చల్పాక పీహెచ్‌సీకి పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.



# వేంపల్లె లో ప్రపంచాన్ని శాసించే లిథియం, గాలియం ఖనిజ నిక్షేపాల గుర్తింపు..!!




తెలుగు గళం న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 14: రాయలసీమలో లిథియం, గాలియం నిక్షేపాలు భారీగా ఉన్నట్లు శాస్త్రవేత్తల గుర్తింపు.. రాయలసీమను రత్నగర్భగా పిలుస్తున్న నేపథ్యంలో తాజాగా కడప బేసిన్ లోని వేంపల్లె ఫార్మేషన్ లో ప్రపంచాన్ని శాసించే కీలక ఖనిజాలైన లిథియం, గాలియం నిక్షేపాలు భారీగా ఉన్నట్లు నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు గుర్తించారు. గరిష్టంగా టన్నుకు 1000 పీపీఎం లిథియం, 250 పీపీఎం గాలియం ఉన్నట్లు తేలింది. కేంద్ర ప్రభుత్వం వీటి అన్వేషణకు రూ. 140 కోట్లు మంజూరు చేసింది. రాయలసీమను రత్నగర్భ అని పిలుస్తారు. ఇప్పటికే ఈ ప్రాంతం సున్నపురాయి, యురేనియం వంటి అనేక ఖనిజాలకు ప్రసిద్ధి గాంచింది. ఇప్పుడు, ప్రపంచవ్యాప్తంగా అత్యంత కీలకమైన, భవిష్యత్తు సాంకేతికతకు అవసరమైన లిథియం, గాలియం నిక్షేపాలు భారీగా ఉన్నట్లు కనుగొనబడింది. కడప బేసిన్‌లో 200 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న వేంపల్లె ఫార్మేషన్ పరిధిలో నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తలు ఈ రెండు ఖనిజాలను గుర్తించినట్లు సమాచారం. ఇక్కడి నమూనాలను క్షుణ్ణంగా పరిశీలించగా, గరిష్టంగా టన్నుకు 1000 పీపీఎం లిథియం, 250 పీపీఎం గాలియం నిల్వలు ఉన్నట్లు నిర్ధారించారు. ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, మొబైల్ ఫోన్లు, రక్షణ పరికరాలు వంటి ఆధునిక పరిశ్రమలకు లిథియం, గాలియం కీలకమైనవి తెలిపారు. ఈ కీలక ఖనిజాల అన్వేషణను మరింత వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నేషనల్ మినరల్ ఎక్స్ప్లోరేషన్ ట్రస్ట్ ఎన్ఎంఈటి కు 140 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. అనంతరం, రాష్ట్ర గనుల శాఖతో కలిసి ఎన్జిఆర్ఐ మెగా సర్వేను ప్రారంభించింది. భూగర్భంలో ఈ ఖనిజాలు ఎంత విస్తీర్ణంలో, ఎన్ని అడుగుల లోతులో ఉన్నాయో తెలుసుకోవడానికి శాటిలైట్ మ్యాపింగ్, జియో ఫిజికల్ సర్వే, కోర్ డ్రిల్లింగ్, ల్యాబ్ టెస్టింగ్ వంటి అధునాతన పద్ధతులను ఉపయోగిస్తున్నారు. ఈ ఆవిష్కరణ రాయలసీమకు, ఆంధ్రప్రదేశ్‌కు అపారమైన ఆర్థిక ప్రయోజనాలను చేకూర్చగలదని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు.

# భాస్కర్ నగర్‌లో ఘనంగా గణపతి ఉత్సవాలు



రాజమహేంద్రవరం (తెలుగు గళం) సెప్టెంబర్ 14 : రాజమండ్రి సీటీఆర్ఐ భాస్కర్ నగర్‌లో భాస్కర్ నగర్ గణేష్ ఉత్సవ కమిటి అధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ వార్షిక గణపతి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణనాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. హరి బెనర్జీ దంపతులు పీటలపై కూర్చొని పూజలు నిర్వహించారు.

తొమ్మిది రోజుల పాటు గణపతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజూ గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించడంతో పాటు భక్తులను ఆకట్టుకునే విధంగా వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మరుకుర్తి రవి యాదవ్, అడబాల రాజు, మరుకుర్తి కుమార్ యాదవ్ లు తెలిపారు. . పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎంపీ భరత్ రామ్, టీడీపీ నాయకులు ఎర్ర వేణుగోపాలరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, నక్కా చిట్టిబాబు, కాశి నవీన్, దొమడపాటి సత్యం బాబు జనసేన నాయకులు అనుశ్రీ సత్యనారాయణ, వై. శీను, వివిద పార్టిలకు చెందిన నాయకులు కురగంటి సతీష్, కాలెపు సాయిరామ్, జవ్వాది మురలీ కృష్ణ, విజయలక్ష్మి, బూరాడ రమేష్ ప్రసాద్, చింతపల్లి నాని, పితారామకృష్ణ, అను యాదవ్, అనంతలక్ష్మి, కృష్ణవేణి, గుత్తుల హర్షా, కానుబోయిన సాగర్, యాదవ సంఘం నాయకులు అంకం గోపి, బర్ల బాబూరావు, నక్కెళ్ళ బాబూరావు, నొడగల సుధ, జానా కేసవ, పడాల నాగరాజు, పడాల శ్రీను తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు . గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.గణపతి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని చాటేలా నిర్వహించాలని అన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.